

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

# గణేష్ ఉత్సవాలకు ఆదిలోనే అపశృతి

**విగ్రహం తరలింపులో విషాదం ★ విద్యుత్‌షాక్‌తో వ్యాన్ డ్రైవర్ మృతి**

**ఘట్‌కేసర్, సెప్టెంబరు 8, ప్రభాతవార్త:** వినాయక విగ్రహం తరలిస్తుండగా కరెంట్ తీగ తగిలి విద్యుత్‌షాక్‌తో లారీ డ్రైవర్ మృతిచెందిన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్వాల్‌కు చెందిన శ్రీకృష్ణయూత్ అసోసియేషన్ గణేశ్ ఉత్సవ నిర్వహకులు సోమవారం రాత్రి ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ ఘణాపూర్ పవర్‌గ్రిడ్ సమీపంలోని వినాయక విగ్రహాల తయారీ కేంద్రానికి వచ్చారు. అశోక్‌లేలాండ్ వాహనం (టిజి10టి-6203)లో నిర్వహకులు శరత్‌యాదవ్ ఇక్కడి నుంచి అల్వాల్‌కు గణేశ్ విగ్రహం తరలించేందుకు డ్రైవర్ భానుప్రసాద్ అశోక్ (28) తో మాట్లాడుకున్నారు. వాహనంలో గణేశ్ విగ్రహాన్ని ఎక్కించుకొని రాత్రి 8:30 గంటలకు బయలుదేరిన కొద్దిసేపటికే రోడ్డుపై 11 కెవి హైటెన్షన్ విద్యుత్ తీగలు వేలాడుతుండటాన్ని గమనించి, ప్రమాదం పొంచి ఉందని నిర్వహకుడు శరత్ యాదవ్‌కు భానుప్రసాద్ తెలిపాడు. అయినప్పటికీ నిర్వహకుడు తీవ్ర నిరక్ష్యంతో ఏం కాదు వాహనాన్ని ముందుకు తీసుకెళ్లమని చెప్పాడు. వాహనం ముందుకు వెళ్తున్న క్రమంలో గణేష్ విగ్రహం 11 కెవి వైర్లకు తగలడంతో వాహనం మొత్తం విద్యుత్ ప్రవహించింది. ప్రాణభయంతో కిందికి దిగడానికి ప్రయత్నించిన డ్రైవర్ భానుప్రసాద్ తీవ్ర విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో వెంటనే నిర్వహకులు సికింద్రాబాద్ యశోద ఆసుపత్రికి తరలించారు. దాదాపు 60 శాతం కాలిన గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున 01:30 గంటలకు మృతి చెందాడు. డ్రైవర్ చెప్పినా వినకుండా ఉత్సవ నిర్వహకుడు శరత్‌యాదవ్ నిర్లక్ష్యం చేసి ఈప్రమాదానికి కారణమయ్యాడని మృతుడి తమ్ముడు తరుణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఘట్‌కేసర్ పోలీసులు తెలిపారు.

# ముట్టడి కాక



రాజీవ్‌రహదారిపై పోలీస్ పికెటింగ్

**శామీర్‌పేట/జవహర్‌నగర్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త :** మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌ను ముట్టడించాలని కాంగ్రెస్ పార్టీ పిలుపునివ్వడంతో మేడ్చల్ జిల్లా శామీర్‌పేట రాజీవ్ రహదారిపై తీవ్ర రాజకీయ ఉద్రిక్తత నెలకొంది. శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా పోలీసులు రాజీవ్ రహదారి పరిసరాల్లో, బొల్లారం, జవహర్‌నగర్ తదితర ప్రాంతాల్లో చెక్‌పోస్టులు, భారీ పికెటింగ్ ఏర్పాటు చేసి ఉదయం నుండి రాత్రి వరకు వాహనాలను జల్లెడ పట్టారు.
మరోవైపు కేసీఆర్‌కు మద్దతుగా నిలిచేందుకు ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌కు బయలుదేరిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకుల వాహనాలను పోలీసులు మార్గమధ్యలోనే అడ్డుకోవడంతో ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది.
శామీర్‌పేట వద్ద బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు పి.సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కోవా లక్ష్మిలను పోలీసులు అదుపులోకి తీసుకుని బొల్లారం పోలీస్ స్టేషన్‌కు తరలించారు.
అదేవిధంగా బొల్లారం వాటర్ ట్యాంక్ చెక్‌పోస్ట్ వద్ద బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్, టి. హరీష్‌రావు, జగదీశ్వర్ రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, నిరంజన్ రెడ్డి, వివేకానంద, పల్లా రాజేశ్వర్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, కొత్త ప్రభాకర్ రెడ్డిలను అడ్డుకుని అరెస్ట్ చేసి జవహర్‌నగర్, కీసర, బొల్లారం పోలీస్ స్టేషన్లకు తరలించారు. పోలీసుల తనిఖీలు, అడ్డంకుల కారణంగా రాజీవ్ రహదారిపై తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ సందర్భంగా జవహర్‌నగర్ పిఎస్ వద్ద మాజీ మంత్రి టి. హరీష్‌రావు మాట్లాడుతూ, తెలంగాణలో ప్రజాస్వామ్యం పూర్తిగా ఖూనీ అయిందని, రాష్ట్రంలో వెంటనే రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా, రైతు బీమా, యూరియా కొరత, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి ప్రజా సమస్యల నుండి ప్రజల దృష్టి మళ్లించడానికే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రకమైన రాజకీయ విమర్శలు, అక్రమ అరెస్టులకు పాల్పడుతోందని విమర్శించారు. అలాగే మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో శాంతిభద్రతలు కాపాడాల్సిన సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నేతలను కేసీఆర్ ఫామ్‌హౌస్ దాడికి ప్రేరేపిస్తున్నారని తీవ్ర స్థాయిలో ఆరోపించారు.

**శామీర్‌పేట, జవహర్‌నగర్‌లో పొలిటికల్ ఫైర్**

**కెసిఆర్ ఫామ్‌హౌస్ ముట్టడికి కాంగ్రెస్ పిలుపుతో రచ్చ**

**మద్దతుగా వెళుతున్న బిఆర్ఎస్ ప్రముఖుల అరెస్ట్**

**స్తంభించిన రాజీవ్ రహదారి**

**రాష్ట్రపతి పాలన విధించాలి: హరీష్‌రావు**

**ముట్టడికి సీఎం రేవంతే ప్రేరేపిస్తున్నారు: సబితా ఇంద్రారెడ్డి**



జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న మాజీ మంత్రి హరీష్ తదితర బిఆర్ఎస్ నాయకులు

# భగ్గుమన్న కాంగ్రెస్

**వికారాబాద్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా కేంద్రంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీల అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ శ్రేణులు భారీ ర్యాలీ చేపట్టాయి. ఆర్అండ్‌బి అతిథి గృహం నుండి ఎన్‌టీఆర్ చౌరస్తా వరకు సాగిన ఈ ర్యాలీలో పార్టీ నాయకులతో పాటు స్పీకర్ కుమార్తె గడ్డం అనన్య పాల్గొన్నారు. నిరసనకారులు కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు, ఎమ్మెల్సీ తాతా మధు దిష్టిబొమ్మలను దగ్ధం చేసి, బీఆర్ఎస్ నేతలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**షాద్‌నగర్ :** షాద్‌నగర్ పట్టణంలోని కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్, ఆ దివాసీ, ఎస్సీ, ఎస్టీ సెల్ నాయకులు అత్యవసర విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి బీఆర్ఎస్ నేతల వైఖరిని తీవ్రంగా నిరసించారు. దళిత వర్గానికి చెందిన స్పీకర్‌ను అవమానించిన ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డిల సభ్యత్వాన్ని తక్షణమే రద్దు చేయాలని, వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**నందిగామ :** నందిగామ మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై కాంగ్రెస్ నాయకులు తీవ్ర స్థాయిలో ఆందోళన నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దేపల్లె కుమారస్వామి గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డిల దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిలో ఉన్న దళిత నేతను కించపరిచినందుకు వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని స్పష్టం చేశారు.

**పూడూరు:** పూడూరు మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి కాంగ్రెస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. పిఏసిఎస్ వైస్ ఛైర్మన్ సురేందర్, జిల్లా కార్యదర్శులు పెంటయ్య, అజీమ్ పటేల్ మాట్లాడుతూ శాసనసభాపతిని వ్యక్తిగతంగా దూషించిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీల వైఖరిని తప్పుపట్టారు. బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.



ర్యాలీలో మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్ కుమార్తె గడ్డం అనన్య



నందిగామలో బిఆర్ఎస్ ఎమ్మెల్సీల దిష్టిబొమ్మ దగ్ధం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

**స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యల వివాదం**

**పలుచోట్ల పార్టీ శ్రేణుల నిరసన ర్యాలీలు**

**ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డిల సభ్యత్వం రద్దుకు డిమాండ్**



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెఎసి చైర్మన్ బి.రవిప్రకాశ్

## ప్రభుత్వ మొండి వైఖరిపై ఉద్యోగులు గళం వినిపించాలి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 8, ప్రభాతవార్త :** ఈ నెల 10వ తేదీన జరిగే ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని మేడ్చల్ జిల్లా టిజిఈజెఎసి చైర్మన్ బి.రవిప్రకాశ్ పిలుపు నిచ్చారు. మంగళవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో ఉద్యోగ సంఘాలతో ఆయన ఈ నెల 10న నిర్వహించే ఛలో హైదరాబాద్ కార్యక్రమంపై సమీక్షించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ బి.రవిప్రకాశ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించటంలో రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరిని అవలంభిస్తుందని విమర్శించారు. చిత్తశుద్ధి లేని ప్రభుత్వ పాలనపై ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కార్మికులు గళం వినిపించాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, అదనపు ప్రధాన కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

# గురుకులంలో కీచకుడు!

**విద్యార్థి తల్లిపై ప్రిన్సిపాల్ అసభ్య ప్రవర్తన**

**బాధితురాలి ఫిర్యాదుతో దేహశుద్ధి చేసిన బంధువులు**

**అరెస్టు చేయాలంటూ ప్రజాసంఘాల ఆందోళన**

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** వితంతు పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ప్రిన్సిపాల్‌కు దేహశుద్ధి చేసిన సంఘటన వికారాబాద్ జిల్లాలో వెలుగులోకి వచ్చింది. తాండూరు పరిసరాలలో ఉన్న మహాత్మాజ్యోతిబా పూలే గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్ అదే స్కూలులో చదువుతున్న విద్యార్థి తల్లి పట్ల కొంతకాలంగా ఫోన్‌లో వేధిస్తున్నారు. ఈ విషయం ఆమె బంధువులకు తెలియజేయడంతో మంగళవారం ప్రిన్సిపాల్‌కు దేహశుద్ధి చేశారు. వివరాల్లోకి వెళితే యాలాల మండలంలో ఓ గ్రామానికి చెందిన మహిళకు కొంతకాలం క్రితమే భర్త చనిపోయాడు. ఆమె కుమారులు తాండూరు పరిసరాలలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో చదువుతున్నారు. ఇటీవల స్కూలులో విద్యార్థులకు మధ్య గొడవ జరిగింది. అందులో సదరు మహిళ కుమారుడు కూడా ఉన్నట్లు గుర్తించారు. ప్రిన్సిపాల్ జోక్యం చేసుకుని వితంతు మహిళను పాఠశాలకు పిలిపించి విద్యార్థుల మధ్య రాజీ కుదుర్చారు. అయితే, సదరు మహిళ ఫోన్‌నెంబర్ తీసుకున్న ప్రిన్సిపాల్ తరచూ ఆమెకు ఫోన్ చేసినట్లు బంధువులు తెలిపారు. రెండు నెలలుగా తనను ప్రిన్సిపాల్ వేధింపులకు గురి చేస్తున్నా రంటూ బంధువుల ముందు వాపోయింది. దాంతో మంగళవారం యాలాల మండలం అగ్గనూరు వద్దకు రావాలని ప్రిన్సిపాల్‌ను కోరారు. వెంటనే అక్కడికి చేరుకున్న ప్రిన్సిపాల్‌కు ఇద్దరు మహిళలు, ఓ వ్యక్తి దేహశుద్ధి చేశారు. అంతటితో ఆగకుండా యాలాల పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వచ్చారు. అయితే, తనపై అకారణంగా దాడి చేశారంటూ వితంతు మహి ళతో పాటు ఇద్దరు వ్యక్తులపై ప్రిన్సిపాల్ లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. ప్రిన్సిపాల్‌పై కఠిన చర్య తీసుకోవాలంటూ బాధిత మహిళ తరపున కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇరువర్గాల నుంచి ఫిర్యాదులు స్వీకరించామని ఎస్సై విఠల్‌రెడ్డి తెలిపారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లిన తర్వాత కేసు దర్యాప్తు వేతమంతం చేస్తామని స్పష్టం చేశారు. ఇలా ఉండగా తాను మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించలేదని ప్రిన్సిపాల్ వివరణ ఇచ్చారు. తనపై అనవసరంగా దాడి చేసి కొట్టారని వాపోయారు. బాధ్యులైన వారిపై కేసు నమోదు చేయాలంటూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.
మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ప్రిన్సిపాల్‌పై కఠిన చర్య తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం, కేవీపీఎస్ తదితర సంఘాలు పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన వ్యక్తం చేశాయి. బీసీ సంఘం నియోజకవర్గం కన్వీనర్ కే.రాజ్‌కుమార్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఉప్పలి మల్కయ్య మాట్లాడుతూ విద్యాబుద్ధులు నేర్పాల్సిన ప్రిన్సిపాల్ ఇలాంటి నీచమైన పనులకు పాల్పడం సిగ్గుచేటని మండిపడ్డారు. పాఠశాలకు వచ్చిన విద్యార్థి తల్లిపట్ల అసభ్యంగా ప్రవర్తించడం శోచనీయమని అన్నారు. వెంటనే ఆయనను సస్పెండ్ చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. మహిళలకు, విద్యార్థినిలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోలేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఆందోళన కార్యక్రమంలో సంఘాల నేతలు సయ్యద్ షకూర్, గడ్డం వెంకటేష్, లక్ష్మణచారీ, నరేంద్ర, పిట్ల నర్సింహులు, బాలరాజ్, అశోక్, పకిరప్ప, మధు, అంజిలప్ప తదితరులు పాల్గొన్నారు.



పోలీస్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న ప్రజాసంఘాలు

# కుటుంబ కలహాల నేపథ్యం..?

# తల్లీకొడుకుల ఆత్మహత్య



సంఘటనా స్థలంలో విచారిస్తున్న పోలీసులు

## వారం తర్వాత వెలుగులోకి..కుళ్లిపోయిన మృతదేహాలు

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** కుటుంబ కలహాలతో తల్లీకొడుకు ఆత్మహత్య చేసుకున్న ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పాడుబడిన ఇంట్లో వారం రోజుల క్రితమే పురుగుల మందు సేవించి సూసైడ్ చేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. శవాల దుర్వాసన పసిగట్టిన పశువుల కాపరుల సమాచారం మేరకు తాండూరు రూరల్ సర్కిల్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా వివరాలు బయటపడ్డాయి. మృతులు తాండూరు రూరల్ మండలానికి చెందిన కోటబాసుపల్లికి చెందిన కమ్మరి తులజమ్మ (45), ఆమె కుమారుడు కమ్మరి నరేష్ (26)గా గుర్తించారు. కమ్మరి పనులు చేసుకుంటూ జీవిస్తున్న కమ్మరి శంకర్‌కు భార్య తులజమ్మతో పాటు కుమారుడు నరేష్ ఉన్నారు. నరేష్‌కు కర్ణాటకలోని మిర్యాణం గ్రామానికి చెందిన భవానీతో వివాహం జరిగింది. భార్యభర్తల మధ్య అభిప్రాయభేదాలు రావడంతో ఇటీవల భవానీ పుట్టింటికి వెళ్లిపోయింది. ఇంట్లో గొడవలు కావడంతో మనోవేదనకు గురైన తులజమ్మ, నరేష్ వారం రోజుల క్రితం ఇల్లు విడిచి వెళ్లిపోయాడు. వారి కోసం తండ్రి గాలించడం మొదలుపెట్టారు. వారు నేరుగా సమీపంలోని ఐనెల్లి గ్రామ పరిసరాలలో తమకు చెందిన పాడుబడిన ఇందిరమ్మ ఇంట్లో పురుగుల మందు సేవించారు. వారిని ఎవరూ గమనించకపోవడంతో అక్కడే మృతిచెందారు. మంగళవారం అటుగా వెళ్లిన పశువుల కాపరులకు దుర్వాసన రావడంతో అనుమానం వచ్చి సర్పంచ్ గోపాల్, ఉపసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు హరీశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. వారు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఎస్సై రాథోడ్ వినోద్‌కుమార్ సంఘటనా స్థలానికి వెళ్లి శవాలను పరిశీలించగా కుళ్లిపోయి ఉన్నాయి. సమీపంలో పురుగుల మందు డబ్బా కనిపించింది. అది సేవించి వారు ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. అక్కడే పోస్టుమార్టం నిర్వహించేందుకు ఏర్పాటు చేశారు. ఈ సమాచారం మృతుల బంధులకు తెలిపారు. వారం రోజుల క్రితం తులజమ్మ, నరేష్ రోడ్డుపై నడుచుకుంటూ వెళ్లినట్లు స్థానికులు పోలీసులకు తెలిపారు. కేసు దర్యాప్తు చేట్టినట్లు సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

## ఆమనగల్లులో అర్ధరాత్రి ప్రమాదం : నలుగురికి గాయాలు

**ఆమనగల్లు, సెప్టెంబరు 8, ప్రభాతవార్త:** ఆమనగల్లు పట్టణంలో రాజీవ్ చౌరస్తాలో సోమవారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. నిజామాబాద్ జిల్లా నుండి శ్రీశైలం పుణ్యక్షేత్రం వెళుతున్న వాహనాన్ని అతివేగంతో వచ్చిన పాల ట్యాంకర్ ఢీ కొట్టిన ఘటన ఒకటి చోటుచేసుకుంది ప్రమాదంలో ప్రాణం నష్టం ముప్పు తప్పింది. ప్రమాదంలో పలువురికి తీవ్ర గాయాలు తగిలాయి. ఆమనగల్లు సబ్ ఇన్స్పెక్టర్ సంతోష్ రెడ్డి తెలిపిన కథనం ప్రకారం నిజామాబాద్ జిల్లా చెందిన 20 మంది డిడి 01 ఏ ఏ 9390 నెంబర్ గల టెంపో ట్రావెలర్‌లో ఆంధ్రప్రదేశ్

>>2

# బ్లాక్‌స్పాట్లపై ప్రత్యేక దృష్టి: సిపి తరుణ్ జోషి



మిర్జాగూడలో ఎర్రమట్టిని తరలించిన వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన గ్రామస్తులు

**రంగారెడ్డి అర్బన్ సెప్టెంబరు 8,ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదాల నివారణకు ఇక నిర్లక్ష్యం సహించేది లేదని ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డా. తరుణ్ జోషి స్పష్టం చేశారు. ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి, బ్లాక్‌స్పాట్ల వద్ద తక్షణమే అవసరమైన ఇంజినీరింగ్ చర్యలు చేపట్టాలని, సంబంధిత శాఖలు గడువుతో కూడిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలో రోడ్డు భద్రతపై పోలీస్, ట్రాన్స్‌పోర్ట్, ఆర్అండ్‌బీ, మున్సిపల్, జీహెచ్ఎంసీ, ఎన్‌హెచ్ఏఐ, ఆర్టీసీ, హెల్త్ తదితర శాఖల అధికారులతో సీపీ అధ్యక్షతన రోడ్ సేఫ్టీ స్టేక్‌హోల్డర్ కోఆర్డినేషన్‌పై సమీక్ష నిర్వహించారు. జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ చందనా దీప్తి,, ట్రాఫిక్ డీసీపీ శివమ్ ఉపాధ్యాయ, ఐపీఎస్‌తో పాటు వివిధ శాఖల ఇంజినీర్లు హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డా. తరుణ్ జోషీ మాట్లాడుతూ.. గత మూడు సంవత్సరాల్లో గుర్తించిన 31 బ్లాక్‌స్పాట్లలో 426 ప్రమాదాలు నమోదయ్యాయి. వీటిలో 176 ప్రాణాంతక ప్రమాదాలు, 250 ప్రాణాంతకం కాని ప్రమాదాలు ఉన్నట్లు సమావేశంలో వెల్లడైందన్నారు. రోడ్డు ప్రమాదాల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రతి బ్లాక్‌స్పాట్‌ను సంబంధిత శాఖలు క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రమాదాలకు కారణాలను తొలగించాలని సీపీ సూచించారు. 2024లో 800 మంది, 2025లో 732 మంది, 2026 సెప్టెంబర్ వరకు 470 మంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వివరించారు. అధిక ట్రాఫిక్ రద్దీ ఉన్న ప్రాంతాల్లో ఆక్రమణలు, భారీ వాహనాల రాకపోకలు, రోడ్ల వెడల్పు కొరత, వాణిజ్య కార్యకలాపాలు, పాదచారుల రద్దీ వంటి అంశాలను గుర్తించి పరిష్కరించాలని సీపీ ఆదేశించారు. అవసరమైన చోట రోడ్ ఇంజినీరింగ్ మార్పులు, మెరుగైన లైటింగ్, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రతి ప్రాణాంతక రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు సంబంధిత శాఖలు ఒక నోడల్/సబ్‌ఆర్డినేట్ అధికారిని నియమించాలని ఆదేశించారు.

# విల్లాస్ కోసం కాల్వను పూడ్చి..

# రాచబాట

**ప్రభుత్వ భూమిని కొల్లగొట్టి మట్టి తరలింపు**

**కలెక్టర్‌కు స్థానికుల ఫిర్యాదు**

**ప్రజావసరాలకు ఉపయోగపడే కాల్వను పునరుద్ధరించాలని విజ్ఞప్తి**

**చేవెళ్ల, సెప్టెంబరు 8, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మీర్జాగూడ గ్రామంలో ఏళ్ల నాటి కాల్వను పూడ్చి వేసి కొందరు రియల్టర్లు 40 ఫీట్ల రోడ్డు వేశారని మీర్జాగూడ గ్రామానికి చెందిన రాజేష్ జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డికి ఫిర్యాదు చేశారు. చేవెళ్ల మండలం మీర్జాగూడ గ్రామం నుంచి ఆలూరులో ఏర్పాటు చేస్తున్న విల్లాస్ కోసం కొందరు స్థానిక నేతలు, రియల్టర్లు కలిసి సుమారు 30 ఎకరాల వరకు భూములు కొనుగోలు చేశారు. విల్లాస్ రాచబాట కోసం అవరోధంగా ఉన్న కాలవకు ఎసరు పెట్టారు. అంతటితో ఆగకుండా ప్రభుత్వ భూమి నుంచి ఎర్రమట్టిని కొల్లగొట్టి కాలువ పూడ్చటానికి వినియోగించారు.
సుమారు 15 రోజుల నుండి రాత్రి పగలు తేడాలేకుండా ప్రభుత్వ బూమిలో ఎర్రమట్టిని తవ్వుతున్నా స్థానిక అధికారులు స్పందించడంలేదని కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మీర్జాగూడ పొలిమేర వరకు కాలువ మూసి 40 ఫీట్ల రోడ్డు వేశారని తెలిపారు. ఎర్రమట్టి కనిపించకుండా నార్సింగి మొరం పోశారని.. ప్రజావసరాలకు ఉపయోగ పడాల్సిన కాలువను పూడ్చివేయటం తగదని ఆందోళన వ్యక్తంచేశారు. తక్షణమే కాలువను పునరుద్ధరించాలని కోరారు. రోడ్డు కోసం అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. రెవెన్యూ ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని ప్రశ్నించారు.

## లారీలో అగ్నిప్రమాదం..

**ఘట్‌కేసర్, సెప్టెంబరు 8, ప్రభాతవార్త:** సరుకులు తరలిస్తున్న లారీలో అగ్నిప్రమాదం జరిగి దాదాపు రూ.16 లక్షల విలువైన వస్తు సామాగ్రి ఖాళీపోయిన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నవత రోడ్ ట్రాన్స్‌ఫోర్ట్‌కు చెందిన 10 టైర్ల ఐషర్‌లారీ కంటైనర్ హయత్‌నగర్ సమీపంలోని ఆటోనగర్ నుంచి పెద్దఅంబర్‌పేట్ ఓఆర్ ఆర్ మీదుగా నాచారంకు బయలుదేరింది. ఘట్‌కేసర్ సమీపంలోని ఘణాపూర్ వియూపి వద్దకు రాగానే కంటైనర్ ఇంజిన్ భాగం నుంచి అకస్మికంగా మంటలు రావడంతో అప్రమత్తమైన డ్రైవర్ కె.శ్యామలరావు ఓఆర్ఆర్‌పై పక్కన నిలిపివేసి దిగడంతో అతనికి ప్రాణాపాయం తప్పినట్లయ్యింది. మంటలు ఇంజిన్, క్యాబిన్ నుంచి కంటైనర్‌కు మొత్తం వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది, ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పించి అదుపులోకి తెచ్చారు. రూ.12,90,000లు ఉంటుందని అంచనా వేశారు. లారీ ఇంజిన్, క్యాబిన్, ముందు టైర్లు కంటైనర్ తీవ్రంగా దెబ్బతినడంతో మరో రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లిందని తెలిపారు.

## భ్రూణ హత్యలకు దారితీసే చర్యలను సహించేది లేదు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 8, ప్రభాతవార్త :** గర్భస్థ శిశువు లింగాన్ని నిర్ధారించటం చట్టరీత్య నేరమని మేడ్చల్ జిల్లా డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ కె.ఆనంద్ స్పష్టం చేశారు. మంగళవారం మేడ్చల్ జిల్లాలోని పోచారం ప్రాంతంలోని జోడ్‌మెట్ల ఎక్స్‌రోడ్డు అన్ష్ ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాష్ట్ర స్థాయి పీసిపిఎన్‌డిటీ టాస్క్‌ఫోర్సు అధికారులు నిర్వహించిన తనిఖీలలో గుర్తించిన నిబంధనల ఉల్లంఘనల నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.ఆనంద్ ఆ ఆసుపత్రిని తనిఖీ చేశారు. దీనికి సంబంధించి అన్ని రికార్డులను ఆయన తనిఖీలు చేశారు. లింగ నిర్ధారణ ద్వారా ఆడ శిశువులపై వివక్ష, భ్రూణ హత్యలకు దారితీసే చర్యలను ఎట్టి పరిస్థితులను సహించేది లేదని హెచ్చరించారు.



పర్సాపూర్‌లో చెట్లకింద అంగన్‌వాడీ టీచర్ల సమావేశం

### చెట్లకింద సమావేశాలు

## ఇబ్బందుల్లో అంగన్‌వాడీ టీచర్లు

**కొడంగల్, సెప్టెంబరు 8, ప్రభాతవార్త :** ఐసీడీఎస్ ప్రాజెక్టు సమావేశాలను చెట్లకింద నిర్వహిస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అంగన్‌వాడీ టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొడంగల్ పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం ఉన్నా అక్కడ స్థలం సరిపోక పోవడంతో సమావేవాలను పర్సాపూర్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో చెట్ల కింద నిర్వహించాల్సి వస్తుందని ప్రత్యేక అవసరాల కోసం ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉందని తెలిపారు. వర్షం వస్తే తడిచిపోయి సమావేశాలని రద్దు చేసుకొని ఇళ్ళకు వెళ్ళిపోయే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. అధికారులు స్పందించి ప్రాజెక్టు సమావేశాలను కొడంగల్ పట్టణంలోని ఏదైనా బిల్డింగ్‌లో లేదా ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అంగన్‌వాడీ ఉపాధ్యాయులు కోరుతున్నారు.

## చేగూరులో సర్ పై అవగాహన సదస్సు



చేగూరులో జరిగిన సర్ కార్యక్రమంలో పాల్గొన్న తహసిల్దార్

**నందిగామ, సెప్టెంబరు 8, ప్రభాతవార్త :** నందిగామ మండలం చేగూరు గ్రామపంచాయతీ లో సర్పంచ్ మంకాల శ్రీశైలం ఆధ్వర్యంలో నిర్వహించిన సర్ అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా తహసిల్దార్ సైదులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఓటర్ల ఐడి వెరిఫికేషన్, కొత్త ఓట్ల నమోదు,ఓటరు జాబితా సవరణలకు సంబంధించిన దరఖాస్తులు ఫారం6, 7, 8 పరిశీలించారు. ఓటు హక్కును ప్రతి ఒక్కరూ విధిగా వినియోగించుకోవాలి అని ప్రజలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నందిగామ ఆర్ ఐ రామ్ చందర్ రావు, పంచాయత్ సెక్రటరీ నవీన్ యాదవ్, వార్డు సభ్యులు రాజశేఖర్, బిఎల్ఓ మంజుల , శివలీల, కారోబార్ భీమేష్, రెవెన్యూ, పంచాయతీ అధికారుల గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

### చదువులను ప్రోత్సహిస్తున్న గణేష్ యువజన సంఘం




విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్ తదితరులు

**నందిగామ, సెప్టెంబరు 8, ప్రభాతవార్త :** విద్యాదానం.. మహాదానం అని నిరూపించి పలువురికి ఆదర్శంగా నిలిచారు నందిగామ గణేష్ యువ జన సంఘం సభ్యులు. నందిగామ హైస్కూల్ విద్యార్థులకు వ్యక్తిగత వికాసం, ప్రముఖుల జీవిత చరిత్రలు, దేశభక్తి, సైన్స్ అండ్ టెక్నాలజీ, హిందీ, ఇంగ్లీష్, తెలుగు నవలలు, కథలు వంటి పుస్తకాలను ఏసియన్ సంస్థ, మై భారత్ రంగారెడ్డి జిల్లా రాజారాం ఫౌండేషన్ నుండి సేకరించి మంగళవారం విద్యార్థులకు అందజేశారు. విద్యార్థుల్లో పఠనాశక్తిని పెంపొందిం చడంతోపాటు జ్ఞానాన్ని మరియు వ్యక్తిత్వ వికాసాన్ని ప్రోత్స హించటమే గణేష్ యూత్ సభ్యుల లక్ష ్యం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, ప్రధానోపాధ్యాయులు సుధాకర్, మై భారత్ ప్రతినిధి దాసరి శ్రీశైలం, ఇబ్రహీం, కే నరేష్, అఖిల్, జగదీష్, అనిల్ విద్యార్థులు పాల్గొన్నారు.

### 22ఏ భూ సమస్యలను పక్కదారి పట్టిస్తున్న కాంగ్రెస్

**ప్రజా సమస్యలపై సమాధానం చెప్పకుండా అసెంబ్లీలో గందరగోళం సృష్టిస్తున్నారు**

**కొంపల్లి అనంతరెడ్డి**



ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, మాట్లాడుతున్న కొంపల్లి అనంతరెడ్డి

**మొయినాబాద్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలను అమలు చేయలేక ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ డ్రామాలకు తెరలేపుతోందని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కొంపల్లి అనంతరెడ్డి విమర్శించారు. మంగళవారం బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు దారెడ్డి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

రాష్ట్రంలోని 22ఏ నిషేధిత భూముల సమస్య, ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులపై ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాయని, వాటిపై సమాధానం చెప్పకుండా అసెంబ్లీ సమయాన్ని వృథా చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అరెస్టు చేయడం, కేటీఆర్‌పై దాడి జరిగిందని ఆరోపణలు రావడం, మాజీ సీఎం కేసీఆర్ ఇంటి ముందు చావు డప్పు కొట్టించడం వంటి ఘటనలు ప్రతిపక్షాన్ని అణచివేసే చర్యలేనని అన్నారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కొత్త నరసింహారెడ్డి, కౌన్సిలర్ కర్రోల శ్రీధర్, మాజీ సర్పంచులు నరోత్తం రెడ్డి, సుధాకర్ యాదవ్, మంజుల, రవి యాదవ్, ఏ.కుమార్, మాజీ ఎంపీటీసీ ముర శ్రీను, మండల ప్రధాన కార్యదర్శి నరసింహగౌడ్, గణేష్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు స్వప్న, సురేందర్ గౌడ్, షాబాద్ శ్యామ్, దర్శన్, ప్రవీణ్, తిరుపతిరెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### యాత్రికుల వాహనాన్ని కొట్టిన పాల ట్యాంకర్

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలోని శ్రీశైలం పుణ్యక్షేత్రాలకు ఆమనగల్ మీదుగా బయలుదేరుతున్నారు. ఇదే క్రమంలో మాడుగుల నుండి హైదరాబాద్ వైపు వెళ్లేందుకు అతివేగంగా వచ్చిన ట్యాంకర్ ఏపీ 31 టి ఎఫ్ 57 15 వాహనం అతివేగంతో వచ్చి బలంగా ఢీకొట్టింది ప్రమాదంలో ట్రావెలర్ వాహనంలో ఉన్న నలుగురికి బలంగా గాయా లయ్యాయి. హుటా హుటిన ఘటన స్థలానికి చేరుకొని పోలీసులు గాయపడ్డ వారిని ఆసుపత్రికి తరలిం చారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ సంతోష్ రెడ్డి తెలిపారు.



ఆమనగల్లులో ప్యాసింజర్ వాహనాన్ని ఢీ కొట్టిన ట్యాంకర్.

# ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దిష్టిబొమ్మలు దగ్ధం

### కెసిఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని నిరసన

**షాద్‌నగర్, సెప్టెంబరు 8, ప్రభాతవార్త :** షాద్‌నగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల పరస్పర ఆందోళనలతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పిలుపు మేరకు బీఆర్ఎస్ శ్రేణులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దిష్టిబొమ్మను దగ్ధం చేసి, పోలీసు స్టేషన్లలో ఫిర్యాదులు చేశాయి. మరోవైపు, ఎమ్మెల్యే శంకర్ వ్యాఖ్యలను వక్రీకరిస్తూ సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని, అసెంబ్లీలో దళిత స్పీకర్ పట్ల బీఆర్ఎస్ నేతలు ప్రవర్తించిన తీరు సిగ్గుచేటని కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆలీ ఖాన్ బాబర్, రఫీ నాయక్‌లు మండిపడ్డారు.

కేసీఆర్‌పై వ్యాఖ్యలకు నిరసనగా నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న వివిధ పోలీస్ స్టేషన్లకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై చట్టపరమైన కేసులు నమోదు చేసి తీవ్ర చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్హెచ్ఓలకు అధికారికంగా ఫిర్యాదు ప్రతులను అందజేశారు. రాజకీయ లబ్ధి కోసం దిగజారుడు వ్యాఖ్యలు చేస్తే ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళనలు తీవ్రతరం చేస్తామని బీఆర్ఎస్ శ్రేణులు స్పష్టం చేశాయి.

**నందిగామ:** నందిగామ మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై బీఆర్ఎస్ గ్రామీణ కమిటీ అధ్యక్షుడు ఎర్రగోరి స్వామి ఆధ్వర్యంలో నాయకులు నల్లబెడ్జీలతో నిరసన తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దిష్టిబొమ్మను బీఆర్ఎస్ శ్రేణులు రోడ్డుపై దగ్ధం చేశాయి. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి కేసీఆర్ చావు కోరుకునేలా మాట్లాడిన ఎమ్మెల్యే శంకర్ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్ డిమాండ్ చేశారు.

**ఎమ్మెల్యే మాటలను వక్రీకరించకండి : కాంగ్రెస్**

అసెంబ్లీకి రాకుండా ఫామ్ హౌస్ లోనే బందీ అయిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తీరును ఎండగడుతూ, అదేవిధంగా దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్ పట్ల బీఆర్ఎస్ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేసీఆర్ ఫామ్ హౌస్ ఎదుట చావు డప్పు కొడతామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చెప్పడాన్ని కొన్ని సోషల్ మీడియా సంస్థలు బిఆర్ఎస్ నాయకులు కుమ్మక్కై రాజకీయంగా వీర్లపల్లి శంకర్ ను దెబ్బ తీయడానికి చేస్తున్న నాటకాలు సాగబోవు అని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్, కాంగ్రెస్ గిరిజన ఆదివాసి కోఆర్డినేటర్ రఘునాయక్ లు స్పష్టం చేశారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో వారు పేర్కొన్నారు.



ఎమ్మెల్యే శంకర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు



ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై ఫిర్యాదు చేస్తున్న బిఆర్స్ నేతలు

# మహిళా ఎమ్మెల్యేలపై దాడి అప్రజాస్వామికం



ఆందోళనలో పాల్గొన్న బీఆర్ఎస్ శ్రేణులు

**షాద్‌నగర్, సెప్టెంబరు 8, ప్రభాతవార్త :** మహిళా ఎమ్మెల్యేలపై దాడి చేసే అధికారం ఎవరిచ్చారుని మాజీ మహిళా ప్రజాప్రతినిధులు, మహిళా కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకురాలు ప్రశ్నించారు. అసెంబ్లీ వద్ద మహిళ ఎమ్మెల్యేలపై జరిగిన దాడిని నిరసిస్తూ మాజీ ఎమ్మెల్యే వై అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా ఎమ్మెల్యేల పై దాడి అప్రజాస్వామికమన్నారు.రాష్ట్రంలో మహిళా ఎమ్మెల్యేలకు రక్షణ లేనప్పుడు సామాన్యుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. వెయ్యి రోజుల ప్రజాపాలనలో ప్రజల అవస్థలు పడుతున్నారని, ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి, ఇచ్చిన హామీలను అమలు చేయమని ప్రశ్నిస్తే దాడులు చేస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా ఎమ్మెల్యేలపై దాడి హేయమైన చర్య అని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మహిళా ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి అనుచరులను అరెస్టు చేస్తున్న పోలీసులు..

**ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి అనుచరుల అరెస్ట్..**

తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ ను దూషించారని ఆరోపణలో అరెస్టు అయిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డిని విడుదల చేయాలని హైదరాబాద్ లోని నారాయణగూడ పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన నిర్వహిస్తున్న నవీన్ రెడ్డి అనుచరులను పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆయనను విడుదల చేయాలని పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళనకు దిగిన నవీన్ రెడ్డి అనుచరులు కాట్నా రవీందర్, శివచారి, సుధీర్, దినేష్, రాజు, అనిల్, చిట్టి, శివ, సందీప్ తదితర బిఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేసినట్టు తెలిపారు. ఎమ్మెల్సీ నవీన్ రెడ్డిని వెంటనే విడుదల చేయాలని అదే విధంగా అదుపులోకి తీసుకున్న మిగతా ప్రజాప్రతినిధులను కూడా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని అంబర్పేట పోలీస్ స్టేషన్ కు తరలిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు దిగుతూ ప్రతిపక్షాలను అణచివేసే ధోరణి అవలంబిస్తుందని కాట్నా రవీందర్ తెలిపారు.

# గణేశ్ విగ్రహాల తరలింపు, నిమజ్జనంపై పోలీసుల సూచనలు

**ఘట్‌కేసర్, సెప్టెంబరు 8, ప్రభాతవార్త:** వినాయక విగ్రహాల రవాణా, నిమజ్జన సమయంలో భక్తులు, వాహనదారులు ప్రాణనష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గణేశ్ విగ్రహాల ఎత్తు, తరలించే మార్గం ఆధారంగా నిర్వాహకులు స్థానిక విద్యుత్ అధికారుల వద్ద ముందస్తు అనుమతి పొందాలని తెలిపారు.

రవాణా సమయంలో ఆరూట్లలో విద్యుత్ సరఫరా తాత్కాలికంగా నిలిపివేయడానికి చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని, విగ్రహం, వాహనం కలిపి మార్గంలో ఉండే 11 కెవి, 33 కెవి, సాధారణ కరెంట్ వైర్లకు తాకకుండా సురక్షితమైన ఎత్తులో ఉండేలా చూసుకోవాలని సూచించారు.

విగ్రహాల తరలింపు సమయంలో వాహనం వెంట ఇన్సులేటెడ్ కర్రలు (పొడి వెదురు బొంగులు/ఫైబర్ స్టిక్స్) కలిగిన వాలంటీర్లను మాత్రమే తీగల సర్దుబాటు కోసం వినియోగించాలని పచ్చి కర్రలు, ఇనుప పైపులు అస్సలు వాడకూడదని ఆయన స్పష్టం చేశారు.

విగ్రహాన్ని తరలించే వాహనం వెనుక భాగంలో మనుషులు కూర్చోవడం, డోలకించటం పూర్తిగా నిషేధమని, వాహనానికి కరెంట్ పాస్ అవుతున్నట్లు గుర్తిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనం నుండి కిందకు అడుగు పెట్టకూడదని (భూమిని తాకకూడదు).

వీలైనంత వరకు లోపలే ఉండి విద్యుత్ సరఫరా ఆగిపోయేలా ఉండాలని, వాహనం నుంచి ఒకేసారి రెండు కాళ్లతో దూకి భూమిపై పడేలా చూడాలని, విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించాలని సూచించారు. నిర్లక్ష్యం ప్రాణాలకే ముప్పుగా మారుతుందని, పండుగను భక్తిశ్రద్ధలతో పాటు సంపూర్ణ భద్రతతో జరుపుకోవాలని ఇన్‌స్పెక్టర్ బాలస్వామి పేర్కొన్నారు.




# డీజేలకు అనుమతి లేదు

**అత్తాపూర్, సెప్టెంబరు 8,ప్రభాతవార్త :** గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని రాజేంద్రనగర్ జోన్ డీసీపీ శ్రీనివాస్ కోరారు. మంగళవారం అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గణేష్ మండపాల నిర్వాహకులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పలు కీలక సూచనలు చేశారు.ప్రతి గణేష్ మండప నిర్వాహకుడు ముందుగా స్థానిక పోలీస్ స్టేషన్‌కు పూర్తి వివరాలతో ఇంటిమేషన్ ఇవ్వాలి. ఉత్సవాల పేరుతో ఎలాంటి నిబంధనల ఉల్లంఘనకు పాల్పడినా ఉపేక్షి ంచేది లేదు" అని డీసీపీ స్పష్టం చేశారు.మండపాల వద్ద కానీ, నిమజ్జన ఊరేగింపుల్లో కానీ డీజే సిస్టమ్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగించకూడదు. మైకులు, లౌడ్‌స్పీకర్లను రాత్రి 10 గంటల వరకు మాత్రమే ఉపయోగించాలి. ప్రతి మండపం వద్ద గరిష్టంగా రెండు సౌండ్ బాక్సులకు మాత్రమే అనుమతి ఉంటుంది" అని ఆయన తెలిపారు.భక్తుల భద్రతే పోలీసుల ప్రధాన ప్రాధాన్యత. అందువల్ల ప్రతి మండపం వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. రాత్రివేళల్లో కమిటీకి చెందిన వాలంటీర్లు మండపాల వద్ద ఉండి భద్రతను పర్యవేక్షించాలి" అని డీసీపీ సూచించారు.అగ్నిప్రమాదాల నివారణకు ప్రతి మండపం వద్ద ఇసుక, నీటిని సిద్ధంగా ఉంచుకోవాలి. ప్రమాదకరంగా విద్యుత్ తీగలు వేలాడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రధాన రహదారులపై ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా మండపాలను ఏర్పాటు చేయాలి. ముఖ్యంగా ఆంబులెన్స్‌లు, అత్యవసర వాహనాలకు మార్గం ఎప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని ఆయన ఆదేశించారు.మండపాల వద్ద, నిమజ్జన ఊరేగింపుల సమయంలో బాణసంచా కాల్చడం పూర్తిగా నిషేధం. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు కనిపించినా, ఏదైనా సమస్య తలెత్తినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. గణేష్ ఉత్సవాలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా జరిగేలా నిర్వాహకులు, భక్తులు పోలీసులతో సమన్వయం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో అత్తాపూస్ సిఐ సీతయ్య,పోలీసు సిబ్బంది,నిర్వాహకులు పాల్గొన్నారు.

### మాజీ మంత్రి మాణిక్‌రావుకు ఘనంగా నివాళి

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** తొలిదశ తెలంగాణ ఉద్యమనేత, దివంగత మాజీ మంత్రి ఎం.మాణిక్‌రావుకు ఘనంగా నివాళి అర్పించారు. మంగళవారం ఆయన 10వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మాణిక్‌రావు సతీమణి అయిన విద్యావికాస్ ట్రస్ట్ చైర్మన్ ప్రొఫెసర్ శశిప్రభ, ఆయన తనయుడు ఎం.రమేష్ మహరాజ్ వేర్వేరుగా కార్యక్రమాలు చేపట్టి అన్నదానం చేపట్టారు. డీసీఎంఎస్ ఎదురుగా ఉన్న ప్రధానరహదారిపై మాణిక్‌రావు నిలువెత్తు విగ్రహానికి పూలమాలలు వేసి ఆయనను స్మరించారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో వివిధ పార్టీల నేతలు, ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు తరలివచ్చారు. 1969 ఉద్యమంలో రాజమంత్రి సెంట్రల్‌జైలులో శిక్ష అనుభవించిన మాణిక్‌రావు వరసగా 14 ఏళ్ల పాటు రాష్ట్ర కేబినెట్ మంత్రిగా పదవులు చేపట్టారని కొనియాడారు. తాండూరు నియోజకవర్గంలో చెరగని ముద్ర వేసిన మాణిక్‌రావు హ్యాట్రిక్ విజయాలు సాధించి ఒకసారి ఏకగ్రీవ ఎమ్మెల్యేగా గెలుపొందారని గుర్తు చేశారు. ఆర్‌అండ్‌బి, సినిమాటోగ్రఫి, వాణిజ్యపన్నులశాఖల మంత్రిగా విశేష సేవలు అందించారని గుర్తు చేశారు. రెండుసార్లు ఎమ్మెల్సీగా ప్రజలకు సేవలందించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. ఆయన సోదరులు ఎం.చంద్రశేఖర్, ఎం.నారాయణరావు కూడా మూడుసార్లు శాసనసభకు ఎన్నికైనారని గుర్తు చేశారు. అభివృద్ధి, సంక్షేమం, ఉపాధి వంటి అంశాలకు పెద్ద పీఠ వేసిన ఘనత మాణిక్‌రావుకే దక్కిందన్నారు. అప్పట్లో పీవీ, చెన్నారెడ్డి తదితర మంత్రివర్గంలో క్రియాశీల పాత్ర పోషించారని వారు కొనియాడారు. ఇందిరాగాంధీ కూడా మాణిక్‌రావుకు మంచి గుర్తింపునిచ్చారని తెలిపారు. తాండూరు ప్రాంతంలో విద్యాభివృద్ధి కోసం ట్రస్ట్‌ను స్థాపించారని తెలిపారు. విద్య, వైద్యం, ఉపాధి కోసమే ట్రస్ట్ ఆస్తులను రిజిస్ట్రేషన్ చేయించారని చెప్పారు. ఉన్నత ఆశయాల కోసం నెలకొల్పిన తమ సంస్థల ఆస్తులు జోలికి ఎవరొచ్చినా ఉపేక్షించబోమని శశిప్రభ స్పష్టం చేశారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమంలో రమేష్‌మహరాజ్, ధారాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

### సర్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలి

**-జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**

**వికారాబాద్, ప్రభాతవార్త:** ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ విచారణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఆదేశించారు.మంగళవారం వికారాబాద్ మునిసిపల్ పరిధిలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ విచారణ కార్యక్రమంలో భాగంగా ఆలంపల్లి ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎస్ఐఆర్‌విచారణకు వచ్చిన ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి డాక్యుమెంట్లు అప్లోడ్ చేయాలని అధికారులకు సూచించారు. అనామలీస్, మ్యాపింగ్ కానీ, ఓటర్ జాబితాలో పుట్టిన తేదీల మార్పుల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఇప్పటివరకు నోటీసులు జారీ చేయని వారిని గుర్తించి విచారణకు హాజరు అయ్యేవిధంగా బిఎల్ఓ లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లా కలెక్టర్‌తో పాటు అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూరు, డీఆర్ఓ స్వర్ణలత, తహసిల్దార్ లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి లు ఉన్నారు.



వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పి స్నేహ మెహ్రా

## క్రీడలతో మానసికోల్లాసం

**జిల్లా ఎస్పి స్నేహ మెహ్రా**

**కుల్కచర్ల,సెప్టెంబరు 8 ప్రభాతవార్త :** యువత క్రీడలపై అసక్తి పెంచుకోని ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా జిల్లా ఎస్పి స్నేహ మెహ్రా అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సాల్విడ్ గ్రామంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి స్నేహ మెహ్రా క్రీడాకారులను పరిచయం చేసుకున్న అనంతరం మాట్లాడుతూ.. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిన ఉల్లాసాన్ని కలిగిస్తాయని తెలిపారు. యువత చెడు వ్యవసనాలకు దూరంగా ఉండి క్రీడల్లో రాణించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి వారికి అవసరమైన ప్రోత్సాహం అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నందన్నారు. టోర్నమెంట్‌లో పాల్గొంటున్న జట్లు క్రీడా స్ఫూర్తితో పోటీపడి ప్రతిభను చాటాలని ఆకాంక్షించారు. అనంతరం క్రీడాకారులకు శుభాక్షలు తెలిపారు. కార్యక్రమంలో పరిగి డిఎస్పి శ్రీనివాస్, ఎస్ఐ రమేష్ కుమార్, పిఎసిఎస్ చైర్మన్ భీంరెడ్డి, ఏఎంసి చైర్మన్ ఆంజనేయులు గ్రామ నాయకులు పాల్గొన్నారు.

### సాంకేతిక పరిజ్ఞానంపై రైతులకు అవగాహన కల్పించాలి

**-జిల్లా కలెక్టర్ దీపక్‌తివారి**



రైతులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

**వికారాబాద్, ప్రభాతవార్త:** సాంకేతిక పరిజ్ఞానంపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అధికారులను ఆదేశించారు. మంగళవారం వికారాబాద్ మండలం నారాయణపూర్ గ్రామంలో మొక్క జొన్న, కంది పంటలను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని రైతులకు పంటల సాగుపై నూతన సాంకేతికతపై అవగాహన కల్పించాలన్నారు. వర్షాభావ ప్రభావం వల్ల పంటల నష్టాన్ని నివారించేందుకు రైతులకు పలు సలహాలు ఇవ్వాలని ఆయన అధికారులకు సూచించారు. నానో యూరియా వాడకం పట్ల రైతుల్లో అవగాహన కల్పించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. కలెక్టర్ తో పాటు అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూరు, జిల్లా వ్యవసాయ అధికారి బి.కవిత, తహసిల్దార్ లక్ష్మీనారాయణ, మండల వ్యవసాయ అధికారి ప్రసన్న లు ఉన్నారు.



జిల్లా కలెక్టర్ దీపక్ తివారిని మర్యాదపూర్వకంగా కలిసిన టాస్ రాష్ట్ర సమన్వయకర్త క్రాంతి రెడ్డి

### టాస్ ప్రవేశాల లక్ష్యాన్ని అధిగమించేలా చర్యలు

**-వికారాబాద్ కలెక్టర్ హామీ**

**వికారాబాద్, ప్రభాతవార్త:** తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ 2026-27 విద్యా సంవత్సర ప్రవేశాల కార్యక్రమంలో భాగంగా టాస్ రాష్ట్ర సమన్వయకర్త క్రాంతి రెడ్డి, వెంకటయ్యలు జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి జిల్లాలో టాస్ ప్రవేశాల పురోగతి, ప్రవేశాల లక్ష్య సాధనపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ, టాస్ ప్రవేశాల లక్ష్యాన్ని త్వరలోనే సాధించడమే కాకుండా, నిర్దేశిత లక్ష్యాన్ని మించి ప్రవేశాలు సాధించేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

ఏసీఎల్‌బీ, టాస్ ప్రవేశాలపై ప్రత్యేక దృష్టి సారించి, క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం, అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, అర్హులైన విద్యార్థులను అధిక సంఖ్యలో ఓపెన్ స్కూల్‌లో చేర్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

విద్యకు దూరమైన విద్యార్థులు, పాఠశాల విద్యను మధ్యలో నిలిపివేసిన వారు, వివిధ కారణాల వల్ల సాధారణ విద్యను కొనసాగించలేకపోయిన వారికి టాస్ ద్వారా విద్యను కొనసాగించే అవకాశాన్ని కల్పించేందుకు జిల్లా యంత్రాంగం సహకరిస్తుందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా టాస్ రాష్ట్ర సమన్వయకర్త క్రాంతి రెడ్డి, జిల్లా కలెక్టర్ ఇతర అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

### నేడు ఎదులాబాద్‌లో విశ్వశాంతి యాగం

**ఘట్‌కేసర్, సెప్టెంబరు 8, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్‌లోని శ్రీభ్రమరాంబికా సమేత మల్లిఖార్జునస్వామి దేవాలయంలో బుధవారం 22వ విశ్వశాంతియాగం నిర్వహిస్తున్నట్లు యాగ నిర్వాహక కర్త కంట్లం గౌరీశంకర్ తెలిపారు. ప్రతి నెలా మాస శివరాత్రి రోజున ఆలయ ఆవరణలోని విష్ణువినాయక కళ్యాణ మండపంలో విశ్వశాంతి యాగము జరుగుతుందని చెప్పారు. లోకకళ్యాణం, ప్రకృతి సమతుల్యత, మానవాళి శ్రేయస్సు (సకల జీవరాశుల క్షేమం) కోసం బుధవారం ఉదయం నిర్వహించే పవిత్ర యజ్ఞాన్ని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తిలకించాలని గౌరీశంకర్ కోరారు. ఘట్‌కేసర్‌కు చెందిన కందట్ల పద్మారెడ్డి దంపతులు, ఎన్ఎఫ్‌సీనగర్ కు చెందిన మమతశర్మ శివప్రసాద్ దంపతులు విశ్వశాంతియాగములో పాల్గొంటారని గౌరీశంకర్ తెలిపారు. దాతలు ముందుకు వచ్చి ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## కాంపౌండ్ వాల్ కూల్చేశారని ఆందోళన

**మొయినాబాద్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్ నగర్ రెవెన్యూ సర్వే నంబర్ 22, 22/ఆ లోగల స్థలంలో కాంపౌండ్ వాల్‌ను మున్సిపల్ అధికారులు అక్రమంగా కూల్చివేశారంటూ బీసీ సంఘాల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టాదారు దామ అరుణ్ కుమార్‌కు మద్దతుగా బీసీ సంఘాల నేతలు మున్సిపల్ అధికారులకు వినతిపత్రం అందజేసి ఆందోళన చేపట్టారు.

ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా, ఎఫ్‌టీఎల్ పరిధి మ్యాప్ లేదా అధికారిక ఉత్తర్వులు చూపకుండా అరుణ్ కుమార్‌కు చెందిన ప్రాకారీ (కాంపౌండ్) గోడను కూల్చివేయడాన్ని తీవ్రంగా ఖండించారు.

**బీసీ భూములపై కుట్ర:**

అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ, బీసీ వర్గానికి చెందిన వ్యక్తి భూమిని ఆక్రమించుకునేందుకు కొందరు ఆఫీసర్లను, పోలీసులను అడ్డుపెట్టుకుని కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ భూమి వివాదం కోర్టు పరిధిలో ఉందని, పదేళ్లుగా అరుణ్ కుమార్ ఆధీనంలో ఉన్న స్థలంలో ఫెన్సింగ్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి భయాందోళనకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. తక్షణమే సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని, లేకపోతే పెద్ద ఎత్తున మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని బీసీ నాయకులు హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో బీసీ నేతలు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, తాటికొండ విక్రమ్ గౌడ్, కనకాల శ్యామ్ కుర్మా, రావులకోల్ నరేష్ ప్రజాపతి పలువురు నాయకులు పాల్గొన్నారు.

